క్లుప్తంగా

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ముగ్గురు వృద్ధులకు దీవెన ఫౌండేషన్ నిత్యావసరాలను పంపిణీ చేసింది. విజయవాడ మొగల్రాజపురానికి చెందిన సిద్ధమ్మతోపాటు సోమయ్య–అంజమ్మ దంపతులు ఏ పనీ చేయలేని దుస్థితిలో తినటానికి తిండి కూడా లేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారు సాయం కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరపున విజయవాడ త్రీ టౌన్ కానిస్టేబుల్ దేవయ్య వారి ఇంటికి వెళ్లి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దయనీయ పరిస్థితి చూసి క్షుద్బాధను తీర్చినందుకు దీవెన ఫౌండేషన్ గ్రూప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ముగిసిన ప్రస్థాన సాధన శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ప్రస్థాన సాధన శిక్షణ ముగిసింది. సోమవారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఠాగూర్ గ్రంథాలయంలో 9 వారాల పాటు విద్యార్థులకు ప్రస్థాన సాధన శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అమరావతి బోట్ క్లబ్ ప్రతినిధి కాకాని తరుణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం యోగ సాధన చేయాలన్నారు. అది కూడా గురువు సమక్షంలోనే చేయాలని సూచించారు. ఠాగూర్ లైబ్రేరియన్ రమాదేవి మాట్లాడుతూ గ్రంథాలయంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతున్నప్పటికీ స్ఫూర్తి కుటుంబం నిర్వహించిన ఆసన, ప్రాణాయామ–ధ్యానం కార్యక్రమాలు మంచి ప్రభావాన్ని చూపాయన్నారు. గురువు ప్రభాకర్ మాట్లాడుతూ సాధన ద్వారా మానసిక ఒత్తిడులు తగ్గిపోతాయన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారన్నారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధులు కాకాని తరుణ్‌కు జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబ సభ్యులు మాధవి, కాదంబరి, జ్యోతి, గిరిజ, స్ఫూర్తి కుటుంబం ట్రస్టీస్ చొప్పరపు నారాయణరావు, పసుపులేటి నారాయణరావు, షణ్ముఖరావు వలంటీర్లు పాల్గొన్నారు.

కమ్మ హాస్టల్‌కు విరాళం

పెనమలూరు: పెనమలూరులోని కమ్మ హాస్టల్‌కు సోమవారం దాత రూ. 2 లక్షల విరాళం అందజేశారు. గ్రామంలో బాలికల కమ్మ హాస్టల్ గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. దాత పుట్టగుంట సరస్వతీదేవి తన భర్త వీరభద్రరావు జ్ఞాపకార్థం విరాళం అందజేశారు. కార్యక్రమంలో సరస్వతీదేవి కుటుంబ సభ్యులు పి.రమేష్, సురేష్, లక్ష్మి, కమ్మ హాస్టల్ ప్రతినిధులు బొర్రా గాంధీ, సభ్యులు పాల్గొన్నారు.

తటాకంలా మారిన రహదారి

విజయవాడ నిర్మల కాన్వెంట్ రోడ్డు వర్షం వస్తే తటాకంలా మారిపోతోంది. వర్షం వచ్చి వెలసి రెండు, మూడు రోజుల వరకు కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. ఆదివారం రాత్రి వచ్చిన వర్షానికి ఆ రహదారి అంతా చెరువులా దర్శనమిస్తోంది. సోమవారం కూడా నీటి ఉధృతి అలాగే ఉంది. ఈ రోడ్డులో పుట్‌పాత్‌పై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన కరెంట్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతూ ఉన్నాయి. రోడ్డుపై నిలిచిన నీటి ఉధృతి పెరిగి పుట్‌పాత్ మీదుకు వస్తే కరెంట్ వైర్లు నీటిలో మునుగుతాయి. అలా జరిగితే పెను ఉత్పాతం జరిగే ప్రమాదం ఉంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నిర్మల కాన్వెంట్ రోడ్డులో రెండో రోజు కూడా రోడ్డుపై తగ్గని నీరు



చెరువును తలపిస్తున్న పటమట చర్చి ప్రాంగణం



నిర్మల కాన్వెంట్ రోడ్డులో వర్షపు నీటి పక్కనే ఫుట్ పాత్ సమీపంలో ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు

నేత్రాల విషయంలో నిర్లక్ష్యం తగదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాల విషయంలో నిర్లక్ష్యం తగదని అమరావతి ఐ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ అన్నారు. అమరావతి ఐ ఫౌండేషన్ దేవదాయ, ధర్మదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలో సోమవారం మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంతశర్మ మాట్లాడుతూ అమరావతి ఐ ఫౌండేషన్ పక్షాన సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రధాన వైద్యులు డాక్టర్ కేతినేని శైలజ, నాదెండ్ల వేణు మాట్లాడుతూ నేత్రాల విషయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శివాలయం ప్రాంగణంలో సుమారు 265 మందికి ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు.

ఆదిరెడ్డికి అశ్రునయనాలతో వీడ్కోలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): యాచన చేసి సంపాదించిన ప్రతి పైసాను దైవ కార్యాలకు వినియోగించిన కలియుగ దానకర్ణుడు యడ్ల యాదిరెడ్డి స్వామి అని ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి కొనియాడారు. స్థానిక సత్యనారాయణపురం అంతిమ యాత్ర భవనం వద్ద సోమవారం యాచకుడు, దాత యడ్ల ఆదిరెడ్డి స్వామి అంతిమ యాత్ర ఘనంగా జరిగింది. కార్యక్రమంలో గౌతంరెడ్డి పాల్గొని ఆదిరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం పలువురు ఆదిరెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిర కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, నాయకులు సామంతపూడి చిన్నా, కనపర్తి కొండలరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణాలు కలిగి ఉండాలి

చిట్టినగర్ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అల్లాహ్ పై నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగి ఉండటమే కాకుండా ఎదుటి వారికి సహాయం, సేవాబావాన్ని ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని చిట్టినగర్ మోతీ మసీదు ఇమామ్ నజీర్ అహ్మద్ ముస్లింలకు ఉపదేశించారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ మోతీ మసీదు, షాదీఖానా ఈద్గాలో ముస్లింలు సోమవారం సామూహిక ప్రార్థనలను నిర్వహించారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం విచ్చేసిన ముస్లింలను ఉద్దేశించి ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగని, ప్రతి ఒక్కరూ అల్లాహ్ చూపిన మార్గంలో నడవాలని, తోటి వారికి సాయం చేయడం ద్వారానే అల్లా కరుణా, కటాక్షాలను పొందగలమని, ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ అల్లాహ్‌ను ప్రార్థించాలని సూచించారు. అనంతరం ముస్లింలందరూ ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సామూహిక ప్రార్థనల కోసం వన్‌టౌన్‌లోని పంజా సెంటర్, కేదారేశ్వరపేట, లంబాడీపేట, పాత రాజరాజేశ్వరిపేట, కంసాలిపేట, భవానీపురం, విద్యాధరపురం, గొల్లపూడి, సింగ్ నగర్ పరిసరాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చారు.



చిట్టినగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఈద్గాలో ప్రత్యేక ఏర్పాట్లు

ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఈద్గా గ్రౌండ్ బురదమయంగా మారడంతో సామూహిక ప్రార్థనలకు విచ్చేసే ముస్లింలకు ఇబ్బందులు కలుగకుండా కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈద్గా గ్రౌండ్‌లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు బురదగా ఉన్న ప్రాంతంలో పొడి మట్టిని చల్లించారు. అనంతరం ఈద్గా గ్రౌండ్‌లో టార్పాలిన్ పట్టాలను ఏర్పాటు చేశారు. ముస్లింల కోసం కూలర్లు ఏర్పాటు చేయడంతో మంచినీటి సదుపాయాన్ని కల్పించారు.



చిట్టినగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు

శరవేగంగా జరుగుతున్న డీసిల్టింగ్ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు నగరంలో వర్షపు నీరు రోడ్డుమీద నిలవకుండా ఉండటంతోపాటు డ్రెయిన్లలో ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా ప్రవహించేందుకు చేపట్టిన ఆపరేషన్ డీ సిల్టింగ్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో డీ సిల్టింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం పశ్చిమ నియోజకవర్గం సర్కిల్–1 పరిధిలో సీవీఆర్ ఫ్లై ఓవర్‌పై గల ఎలక్ట్రికల్ లోకోమోటివ్ షెడ్ దగ్గర, సితార సెంటర్ నుంచి కబేళా వరకు, క్రాంబ్వే రోడ్, ఎన్‌హెచ్ 65 ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్ నుంచి వెంకటేష్ పొంత్రీ రోడ్ వరకు, జీరో బల్బ్ ఏరియా, జెండా చెట్టు, సుబ్రహ్మణ్యం వీధి దగ్గర ఉన్న డ్రెయిన్లలో డీ సిల్టింగ్ పనులు చేశారు. సర్కిల్–2 పరిధిలో రామవరప్పాడు ఫ్లైఓవర్ దగ్గర నుంచి ఎంపీఎల్ ఎంప్లాయిస్ గుణదల హౌరా రైల్వే ట్రాక్ దగ్గర, ముస్తాబాద్ దగ్గర, ఐఆర్ఆర్, వాంబే కాలనీ హెచ్ బ్లాక్, న్యూ రాజరాజేశ్వరిపేట రైల్వే ట్రాక్ వద్ద గల డ్రెయిన్లలో జేసీబీలతో డీ సిల్టింగ్ చేశారు. సర్కిల్–3 పరిధిలో ఉన్న బెంజ్ సర్కిల్ ట్రెండ్ సెట్ మాల్ దగ్గర నుంచి రాజధాని టీ స్టాల్ వరకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ దగ్గర నుంచి స్వీట్ మ్యాజిక్ వరకు ఉన్న డ్రెయిన్ల నుంచి డీ సిల్టింగ్ పనులు చేశారు.



ఎలక్ట్రికల్ లోకో షెడ్ దగ్గర డీ సిల్టింగ్ చేస్తున్న సిబ్బంది



వైఎస్సార్ కాలనీ సమీపంలో జేసీబీతో డీ సిల్టింగ్ చేస్తున్న సిబ్బంది

మొండి బకాయిల వసూలుకు పటిష్ట చర్యలు

విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు



మాట్లాడుతున్న చలసాని రాఘవేంద్రరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): సహకార స్ఫూర్తితో ఉత్తమ సేవలు అందిస్తూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొండి బకాయిల వసూలుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో సోమవారం విజయవాడ, హైదరాబాద్, తిరుపతి జోన్ల పరిధిలోని శాఖల సిబ్బందికి సహకార వ్యవస్థ ప్రాధాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకార జీవనం లేకుండా మానవ మనుగడ లేదని నమ్ముతున్న పాలకవర్గం నిర్ణయాలను సిబ్బంది శ్రద్ధతో అమలు చేయాలన్నారు. బ్యాంక్ అభివృద్ధిలో భాగంగా పాలకవర్గం తీసు కున్న నిర్ణయాలను సమర్థంగా అమలు చేయడంతో పాటు అత్యధిక నిధుల సాధనకు, నిరర్థక ఆస్తుల తగ్గింపునకు కృషి చేసిన సిబ్బందిని రాఘవేంద్రరావు అభినందించారు. ఈ సందర్భంగా మొండి బకాయిల వసూలు చేపట్టిన సిబ్బందికి రూ.కోటి అవార్డు ప్రకటించారు. ఈ సదస్సులో బ్యాంకు మార్గదర్శకుడు మానం ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణారావు, డైరెక్టర్లు జీవీ సత్యనారాయణ మూర్తి, జనార్దన్, చిన్నం కోటేశ్వరరావు, పి.రమణరావు, పి.నారాయణ స్వామి, సీఈవో నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సన్నద్ధం



స్వామి వారి ఆలయం ఎదుట తాటాకు పందిరి, ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరణ



యాగాల నిర్వహణకు కల్యాణ మండపంలో నిర్మించిన షెడ్డు

- శ్రీనివాసుని సన్నిధిలో 21 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 23న స్వామి వారి కల్యాణోత్సవం
- 5 రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. 21వ తేదీన ప్రారంభమై 5 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవస్థాన కమిటీ చేస్తోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే హోమాలు, యాగాల కోసం కల్యాణ మండపం ఆవరణలో ప్రత్యేకంగా ప్లాస్టిక్ కవర్‌తో షెడ్డును సిద్ధం చేశారు. గత వారం రోజులుగా తరచూ వర్షాలు కురుస్తుండటంతో ఉత్సవాలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇక స్వామి వారి ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు ఆలయం ఎదుట తాటాకు పందిరిని నిర్మించారు. బ్రహ్మోత్సవాలను టీటీడీ వేదవిశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మణిదీప్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు, శ్రీనువాసుల గోపాల్ పర్యవేక్షణలో నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేస్తుంది.


21వ తేదీ శుక్రవారం ఉదయం సహస్ర కలశ యాత్ర జరుగుతుంది. ఉదయం దుర్గాఘాట్ నుంచి భక్తులు పవిత్ర కృష్ణాజలాలను కలశాలతో తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. అనంతరం ఉత్సవ మూర్తులకు, మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, స్వామి వారు ఇరు దేవేరులను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెలుగా అలంకరిస్తారు. సాయంత్రం విష్వక్సేన పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తు హోమం, దీక్షాధారణ, కంకణధారణ జరుగుతుంది. 22వ తేదీ ఉదయం అగ్ని ప్రతిష్ఠ, నవ కుంభ స్థాపన, ధ్వజారోహణ, సాయంత్రం నిత్య హోమం, అష్టాక్షరీ హోమం, నవగ్రహ ఆరాధన, సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతుంది. 23వ తేదీ ఆదివారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, సామూహిక కుంకుమార్చన జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఉభయదాతలతో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 24వ తేదీ నిత్య హోమం, బలిహరణ, మహాశాంతి హోమం, శ్రీ పుష్పయాగం, సాయంత్రం గరుడ వాహనంపై స్వామి వారికి నగరోత్సవ సేవ జరుగుతుంది. 25వ తేదీ మంగళవారం శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని ధృవమూర్తికి, ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు, అనంతరం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, అవభృతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, అనంతరం పవళింపు సేవ జరుగుతుంది.

చెక్కు చెదరని చారిత్రక ఆనవాళ్లు

- గత చరిత్రకు కేరాఫ్ అడ్రస్ నూజివీడు కోట
- నాటి నిర్మాణ, వాస్తు శైలికి ప్రతీకలు

నూజివీడు: రాచరికాలు పోయినా, రాజ్యాలు అంతరించినా నాటి కట్టడాలు మాత్రం చారిత్రక సంపదగా నేటికీ దర్శనమిస్తున్నాయి. కట్టడాల్లోని ప్రతి రాయీ నాటి వైభవానికి, గత చరిత్రకు సజీవ సాక్షిగా నిలుస్తోంది. జమీందారీ పాలనకు, కోటలు, గుమ్మాలు, చారిత్రక కట్టడాలకు జిల్లాలోని నూజివీడు ప్రసిద్ధి చెందింది. అప్పటి జ్ఞాపకాలను ఇప్పటి తరానికి గుర్తుచేస్తూ చారిత్రక కట్టడాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి.

పౌరుష, పరాక్రమాల పురిటి గడ్డగా, జమీందారీ పాలనకు నిలయమైన నూజివీడు పట్టణ నిర్మాణం 565–75 సంవత్సరాల మధ్య జరిగినట్టు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఆనాటి రాజరికానికి ఆనవాలుగా పట్టణంలోని గుర్రం గేటు, కుక్కల గేటు, పీజీ కేంద్రం నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. 200 ఏళ్ల క్రితం నిర్మించిన రెండు గేట్లు నేటికీ ఇక్కడి జమీందారీ పాలనను గుర్తుకు తెస్తూ దర్శనమిస్తున్నాయి. కోటకు దక్షిణ, ఉత్తర ద్వారాలుగా కుక్కల గేటు, గుర్రం గేటులను ఆనాడు నిర్మించారు. ఈ రెండు ద్వారాల మధ్య ఉన్న సంస్థానం నుంచి నాటి జమీందార్లు పాలన సాగించేవారు. నూజివీడు జమీందారు రంగాయప్పారావు దక్షిణ ద్వారంపై పహారా కాస్తున్న సైనికులకు తోడుగా ఉన్న కుక్కల విగ్రహాలు చెక్కిన శిల్పాలు ఉంటాయి. అందుకే ఇది కుక్కల గేటుగా ప్రసిద్ధి. ఉత్తర ద్వారంపై గుర్రంపై ఉన్న విజయరాయ అప్పారావు విగ్రహం ఉంటుంది. దీంతో ఈ ద్వారాన్ని గుర్రం గేటుగా పిలుస్తారు. నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఈ గేట్లకు మరమ్మతులు చేయించి రంగులు వేయించడంతో రాజరిక చరిత్రకు నిలువుటద్దంగా దర్శనమిస్తున్నాయి.



పీజీ కేంద్రం నిర్వహిస్తున్న రాజమహల్

రాజమహల్..

నేడు కృష్ణా యూనివర్సిటీ పరిధిలో ఎమ్మార్ అప్పారావు పీజీ కేంద్రంగా పిలుచుకుంటున్న ఆనాటి రాజమహల్‌కు ఏళ్ల చరిత్ర ఉంది. నూజివీడు జమీందారుల్లో ఒకరైన కపిలేశ్వరపురం జమీందారు రాజా మేకా వెంకట రంగయ్య అప్పారావు 1906లో దీనిని నిర్మించారు. ఆ రోజుల్లోనే దీని నిర్మాణానికి రూ.4లక్షలు ఖర్చయిందని పూర్వీకులు చెబుతుంటారు. ఈ మహల్‌లోని విశాలమైన గదులు, వాడిన ఫర్నిచర్ ఆనాటి జమీందారుల జీవన స్థితిగతులను, నిర్మాణ కౌశలాన్ని ఇక్కడ చూడవచ్చు. దాదాపు 30 అంగుళాల మందంతో బలిష్ఠంగా నిర్మించిన గోడలు నేటికీ చెక్కు చెదరలేదు. దర్వాజాలు, కిటికీలు, తలుపులు రాజరిక సౌందర్యానికి అద్దం పడుతున్నాయి. ఎమ్మార్ అప్పారావు 1975లో ఈ భవంతిలో పీజీ కేంద్రం ఏర్పాటు కోసం ఆంధ్రా యూనివర్సిటీకి వితరణగా అందజేశారు. ఆ తర్వాత ఇది నాగార్జున యూనివర్సిటీ పరిధిలోకి వెళ్లింది. ప్రస్తుతం ఈ పీజీ కేంద్రం కృష్ణా యూనివర్సిటీ పరిధిలో ఉంది.



గుర్రం గేటు



కుక్కల గేటు

